గల్పిక

# చివరకి మిగిలేది!

"మంజుశ్రీ"

రామనాథం కుర్చీలో నిర్జీవుడై కూలబడ్డాడు.

వేళ్ళకొసన సిగరెట్ పొగ విడుస్తున్నది. వెన్నెల కురుస్తున్నది. చింతచెట్లలోంచి పరిగెత్తే చంద్రుణ్ణి చూస్తూ "ఈ వెన్నెల శాశ్వతమైపోతే ఎంత బావుండును" అనుకున్నాడు. నవ్వొచ్చింది తన తలపులకి. కొన్నాళ్ళకి వెన్నెలా ముఖం మొత్తుతుంది. చీకటెంత బావుంటుంది, అనిపిస్తుంది.

నుసిరాల్చి సిగరెట్‌ను పీల్చాడు. వేళ్ళ కొసలు చురుక్కుమన్నయ్. "అబ్బా యీ సిగరెట్ ఇలానే శాశ్వతంగా కాలుతూ వుండగూడదా" అనుకున్నాడు. అతి ప్రియంగా పీల్చాడు. పొగ నొదిలి పెట్టడం ఇష్టంలేనివాడిలా నెమ్మదిగా పొగవదిలాడు "ఇక తానేంకోరుకోడు, ఈ సిగరెటొక్కటే శాశ్వతంగా వుండిపోతే!" "వ్యర్థమైన తలంపు"మనసెత్తి పొడిచింది. "అబ్బ!" అనుకున్నాడు రామనాథం.

జీవితం కూడా అంతే, అనుభవిస్తున్నావు. అయిపోతుంది. సిగరెట్ ముట్టించినప్పుడు దాని జీవితం ప్రారంభమవుతుంది. నడుమనడుమ నుసి రాలుతుంది. చివర కయిపోతుంది.

పుట్టినప్పుడే బ్రతుకు వెలిగింపబడుతుంది. క్రమంగా తరుగుతుంటుంది. బ్రతుకు కూడా నుసి రాల్చుకుంటూనే వుంటుంది, చివరి నిశ్వాసం, చివరసారి పొగ పీలవటం, దేహం విడవటం సిగరెట్ పీక పారేయటం.

రామనాథం వేళ్ళకొసలు చురుక్కుమన్నాయి. విసిరి అవతల పారేశాడు. క్రిందికి చూశాడు. సిగరెట్ నుసి వుండలుండగా పడివుంది. వింత ఊహలు ముసురుకున్నాయి. అతడు పసిపిల్లవాడైనాడు. శైశవం, అమ్మ, నాన్న, అనవరతం ఎత్తుకోవటం. అన్నివైపులనుండీ వాత్సల్యం, పువ్వులా పెరిగాడు. నవ్వుల్లో నలిగాడు. పాఠాలు బడిపంతులు, భయం, ఆటలు, పాటలు, తోడు-పిల్లలు, హాయి, సంతోషం. రామనాథం గగుర్పాటు చెందాడు. ఎంత మంచిరోజులు, ఎంత తియ్యటిరోజులు. అది ప్రథమదశ, అది హాయి దశ. సిగరెట్ కూడా మొదట వెలిగించినప్పుడు భలే హుషారిస్తుంది. అది శైశవం. చిన్నతనం శాంతికి మారుపేరు. రామనాథం పెద్దవాడైనాడు.

యవ్వనం అతడిమీదెక్కి కూచుంది. ఉద్రిక్తత, ఉడుకురక్తం, మిత్రులు, కోరికలు, కలిసిరాని ప్రేమలు, కన్నీళ్ళు, స్వేచ్ఛమీది మమత తెంచుకుందామనే ఉబలాటం, ప్రేమ, మోహం, విరహం, ఉపాలంభనం, కథలు, వ్యథలు, వివాహం, ఇదీ యవ్వనం, తృప్తికి మారుపేరు.

రామనాథం నిట్టూర్చాడు. రామనాథం పెద్దవాడైనాడు. చిరాకు, పరాకు, మోసం, విషహాసం, దూరం కావటం, అనుమానం, అసంతృప్తి ఆగడాలు, కృంగిపోవటం, చీదరించుకోవటం, బలం లేని బ్రతుకు, బాధతోడి లోకం, ఇదీ పెద్దతనం, జీవిత నాటకంలో అశాంతి అధ్యాయం.

రామనాథం తల తెల్లబడ్డది. రామనాథంమీద ముసలితనం మూలిగింది. భగవంతుడు, వేదాంతం, ఉపవాసాలు, పురాణశ్రవణం, సత్తు, చిత్తు, శాంతి, ముడతలుబారిన దేహం, తనకులేదు ఇక మోహం, దుర్బలత, శరీరం చెప్పినట్లు వినకపోవటం, ముసలితనం చరమాంకం.

తర్వాత క్షణం ఏమిటి? చివరకి మిగిలేది! ఏమిటిది? చివరకి మిగిలేది ఏమిటి?

రామనాథం వులికిపాటు చెందాడు. తా నడుక్కున్న ప్రశ్న సమాధానం కోసం ఆకాశంకేసి చూశాడు. వెన్నెల కన్నుల పండువుగా వుంది వెన్నెల చాళ్లుకట్టి కురుస్తున్నది. చింతచెట్టు చిటారు కొమ్మపై కెక్కాడు చంద్రుడు, దూరంగా విసిరేసిన సిగరెట్ పీక కనిపించింది.

చివరకి మిగిలేది సిగరెట్ నుసి
గెలవలేని జీవితం మీది కసి.
చివరకి మిగిరేది సిగరెట్‌నుసి. అవశేషం.
చివరకి మిగిలేది చితాభస్మం.

★